నేటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లోని కృష్ణ సింధూరి సంకల్ప లలిత కళానిలయంలో గురువారం నుంచి వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గుమ్మడి జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సంగీతం, చిత్రలేఖనం, కీబోర్డు, వెస్ట్రన్ డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23053266లో సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను తీసుకెళ్లాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వాహనాలను స్టేషన్‌కు తరలించామని, ఆ వాహనాలకు సంబంధించిన యజమానులు ఒరిజినల్ పత్రాలను చూపించి తీసుకెళ్లాలని ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. వాహనాల నెంబర్ల ఆధారంగా పలువురు ఓనర్లను గుర్తించి పోస్టాఫీసు ద్వారా సమాచారం అందించామన్నారు. కూకట్‌పల్లి పోలీసుల ఆధీనంలోని వాహనాలను యజమానులు వెంటనే తీసుకెళ్లాలని, లేకుంటే వాటిని వేలం వేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 94906 17123లో సంప్రదించాలని కోరారు.



ఆలయ కమిటీ సభ్యులతో కార్పొరేటర్ రావుల శేషగిరి

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా: కార్పొరేటర్

గాజులరామారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ రావుల శేషగిరి తెలిపారు. రోడామేస్త్రీనగర్‌లో మధుర మీనాక్షి అమ్మవారి జాతరను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ శేషగిరి హాజరై మాట్లాడారు. డివిజన్‌లో ఉన్న ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో సింగారం మల్లేష్, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు భూపాల్, మంజునాథ్, సురేష్, చందు, వేణు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పూడికతీతలో అవకతవకలకు చెక్ పెట్టాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్ పరిధిలో కొనసాగుతున్న నాలా పూడికతీత పనుల్లో అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకొంటున్నామని జోనల్ కమిషనర్ అభిలాషఅభినవ్ తెలిపారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో బుధవారం ఆమె ఇంజనీరింగ్ విభాగం అధికారులతో నాలా పూడికతీత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. నాలా పూడికతీత పనులు జరిగే ప్రాంతాల్లో ఫిర్యాదుల కోసం ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు నాలా పూడికతీతపై అనుమానం ఉన్నా.. అక్రమాలు చోటుచేసుకొంటున్నట్లు గుర్తించినా రిజిస్టర్‌లో ఫిర్యాదు చేయాలని జెడ్సీ కోరారు. నాలా పనుల్లో పారదర్శకత పాటించడంతో పాటు పనులు నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామని, ఇందుకు ప్రజలు సహకరించాలని జెడ్సీ కోరారు. కార్యక్రమంలో జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఆయా సర్కిళ్లకు చెందిన ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



భక్షికుంట చెరువును పరిశీలిస్తున్న జడ్‌సీ స్నేహశబరీష్, అధికారులు

సీఎస్ఆర్ నిధులతో భక్షికుంట చెరువు సుందరీకరణ

చందానగర్: చందానగర్ డివిజన్ రాజేంద్రరెడ్డినగర్ సురక్షా ఎన్‌క్లేవ్ మధ్యలో ఉన్న భక్షికుంట చెరువును బెంగళూరుకు చెందిన మల్లివాడ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో మంచినీటి చెరువుగా తీర్చిదిద్దారు. బుధవారం జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఉపకమిషనర్ వంశీకృష్ణ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలోని పలు చెరువులను సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కోరారు.



సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

పూర్తయిన రేగులకుంట చెరువు పునరుద్ధరణ

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్ సమీపంలో ఉన్న రేగులకుంట చెరువు పునరుద్ధరించిన పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. చెరువు పునరుద్ధరణకు సహకరించిన సేల్స్‌ఫోర్స్ ఐటీ సంస్థ, మల్లిగవర్డ్ ఫౌండేషన్ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. రేగులకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ కోసం సేల్స్‌ఫోర్స్ ఐటీ సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.కోటీ 50 లక్షలు ఖర్చు చేసింది. బుధవారం పనులు పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి సంస్థ ప్రతినిధులను అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం చెరువు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్లిగవర్డ్ ఫౌండేషన్ సభ్యులు అమిత్, చైతన్య, రాము, సేల్స్‌ఫోర్స్ కంపెనీ ప్రతినిధులు అమిత్, సుష్మ, కిరణ్మయి, చందానగర్, మాదాపూర్ డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు సీతారామయ్య, పూర్ణ, మంగపతి, నరేందర్, అవినాష్ పాల్గొన్నారు.



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

పోలింగ్ శాతం పెంపునకు జీహెచ్ఎంసీ ప్రచారం

గచ్చిబౌలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు జీహెచ్ఎంసీ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అతితక్కువ పోలింగ్ శాతం నమోదు కావడం అధికారులను విస్మయానికి గురిచేసింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా అధికారులు ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రైల్‌విహార్, మైహోం జువెల్స్ తదితర ప్రాంతాల్లో సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారితో రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఐటీ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలని జోనల్ సూపరింటెండెంట్ లెనిన్‌బాబు కోరారు.

ఎస్ఆర్ ఎస్టేట్స్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ఎస్ఆర్ ఎస్టేట్స్‌లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులు పరిశీలించారు. ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి సహాయకచర్యల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ పేలడం దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలన్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు డీఎస్ఆర్‌కే ప్రసాద్, వెంకటేశ్వర్లు, బాబ్జి, సత్యనారాయణ, స్థానికులు ఉన్నారు.



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న జగదీష్‌యాదవ్, అనుచరులు



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్ తదితరులు

బీజేపీలో జోరుగా చేరికలు

మల్కాజిగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్, సీనియర్ నాయకులు రాంబాబు ఆధ్వర్యంలో గీతానగర్‌లో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వెంకటేష్‌గౌడ్, జస్వంత్, సత్యనారాయణ, సీమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **సునీతాయాదవ్ ఆధ్వర్యంలో..**

మల్కాజిగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఘర్‌వాపసీలో భాగంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ గున్నాల సునీతా యాదవ్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో తిరిగి బీజేపీలో చేరారు. వారికి ఈటల రాజేందర్ పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. మౌలాలి డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు పూలపల్లి జగదీష్‌యాదవ్ గతంలో బీఆర్ఎస్‌లో తన అనుచరులతో కలిసి చేరారు. కాగా బీఆర్ఎస్‌లో వారి సిద్ధాంతాలు నచ్చక మాతృసంస్థలోకి ఘర్‌వాపసీ పిలుపులో భాగంగా బుధవారం బీజేపీలోకి వచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్, చంద్రశేఖర్ యాదవ్, డీఎన్ వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

రామంతాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శాగ రవీందర్ బుధవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌కు ఆయనకు కాషాయ కండువాతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు బాలచందర్, బుర్రా రాజేశ్వర్, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావు, జగదీష్, జగన్ యాదవ్, రేవు నర్సింహ్మా, బీరప్ప, కుమార స్వామి, బాలకృష్ణ, వెంపటి శ్రీనివాస్, సురేష్, ఉపేందర్, నాగేష్, ఆనంద్, లింగం, స్వర్ణ షిండే తదితరులు పాల్గొన్నారు.



శాగ రవికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి నామినేషన్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రజలను కోరారు. లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

● **కూకట్‌పల్లి:** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు ర్యాలీగా మేడ్చల్ కలెక్టరేట్‌కు తరలివెళ్లారు.

● **బాలానగర్:** లక్ష్మారెడ్డి నామినేషన్ సందర్భంగా ఆయనకు మద్దతుగా కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ నుంచి మేడ్చల్ కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

● **ఓల్డుబోయినపల్లి:** ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ ఆధ్వర్యంలో ఓల్డుబోయినపల్లి నుంచి బస్సులో తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు.

● **ఫతేనగర్:** ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫతేనగర్ నుంచి మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

● **కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి నామినేషన్‌కు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

● **షాపూర్‌నగర్:** రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్య నారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నాయకులు ర్యాలీ నిర్వహించి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు.



ప్రమాదాలు జరుగుతున్న రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నా

పట్టించుకోరా?

● **స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి**

గాజులరామారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గాజులరామారం దేవేందర్‌నగర్ నుంచి కైసర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు చిన్న రోడ్డు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు కానీ సూచిక బోర్డులు కానీ ఎక్కడా కనిపించడం లేదు. ఉరుకుల పరుగుల నగర జీవనంలో వాహనదారులు పరిమితికి మించిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గాజులరామారం నుంచి కైసర్‌నగర్ వెళ్లే రోడ్డుపై ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

గాజులరామారం నుంచి కైసర్‌నగర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు, బస్తీలు వెలశాయి. జన సంచారం ఎక్కువ అయింది. దీనికి తోడు కూకట్‌పల్లి నుంచి మహాదేవపురం చౌరస్తా మీదుగా దేవేందర్‌నగర్ నుంచి కైసర్‌నగర్ నుంచి దుండిగల్ వరకు రాత్రింబవళ్లు తేడా లేకుండా వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఫలితంగా రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు ద్విచక్రవాహనంపై షాపూర్‌నగర్ నుంచి దుండిగల్ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే మరో ఘటనలో తాపీ పని చేసే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై కూకట్‌పల్లి వెళుతున్న సమయంలో క్రిస్టియన్ గ్రేవ్‌యార్డ్ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు అతడి బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా అనేక సంఘటనల్లో ప్రయాణికులు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలను నివారించడంతో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి (ఫైల్)

ప్రజల ప్రాణాలు కాపాడాలి



ఈ రోడ్డులో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దేవేందర్‌నగర్ నుంచి కైసర్‌నగర్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

- చెట్ల వెంకటేష్, స్థానికుడు



లిఖితరావు



ఉస్నిసా



సఫోరా బేగం



ప్రియాంక గుప్తా

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల హవా

● **సత్తా చాటిన బాలికలు**



బిందు ప్రియ



సయ్యద్‌సమీర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కూకట్‌పల్లిలోని న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. ఇంటర్ ద్వితీయ ఏడాదిలో 480 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా... 318 (66.25 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 556 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా... 301 (54.14 శాతం) మంది పాసయ్యారు. ప్రథమ, ద్వితీయ పరీక్షలు రాసిన వారిలో 26 మంది 90 శాతానికిపైగా మార్కులు సాధించడం గమనార్హం. పలువురు విద్యార్థులు వరుసగా 99, 98, 97 శాతం మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో లిఖితారావు ఎంపీసీ 947 (ఎంపీసీ, 94.7 శాతం) మార్కులు, ఉస్నిసా (బైపీసీ) 938, సఫోరా బేగం (బైపీసీ) 937 చొప్పున మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిల్లో నిలిచారు. ద్వితీయ ఏడాది ఒకేషనల్ స్ట్రీమ్‌లో ఓంకార్ అప్పా 981, సక్కుల రమ్య 975, కె.కుమారి 962 మార్కులు సాధించారు. మొదటి ఏడాది ఫలితాల్లో జనరల్ స్ట్రీమ్‌లో టాపర్స్‌గా బైపీసీలో ప్రియాంకగుప్తా 435 (99 శాతం), ఎంపీసీలో గొడుగు బిందు ప్రియ 459 (98 శాతం), సయ్యద్ సమీర్ ఎంపీసీలో 460 (98 శాతం) మార్కులు సాధించారు. ఇక ఒకేషనల్‌లో గౌసియాబేగం 486, రిషికుమార్‌సాగర్ 484, ఎం.రవి 483 మార్కులతో టాపర్స్‌గా నిలిచారు.

మైనారిటీ రెసిడెన్షియల్‌లో 87 శాతం

ఓల్డుబోయినపల్లి : ఓల్డుబోయినపల్లి డివిజన్ మల్లికార్జున కాలనీలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కాలేజీ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 41 మంది పరీక్షలకు హాజరుకాగ 33 మంది (80.4 శాతం) మాత్రమే పాసైనట్లు ఆయన చెప్పారు. రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 31 మంది పరీక్షలకు హాజరుకాగా 27 మంది (87 శాతం) పాసైనట్లు తెలిపారు.

గౌలిదొడ్డి బాలుర కళాశాల ప్రభంజనం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని గౌలిదొడ్డి గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వట్టికొండ పాపారావు తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు నూటికి నూరుశాతం, బైపీసీలో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణతతో ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను ఎం.భరత్ - 467, గోపిచంద్ - 467, ఎ.రాజశేఖర్ 466, వివేక్‌కుమార్ 446, జాషవా వివేక్- 466 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో సాయిరామ్, ఎం.మూర్తి, రాజు 437 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 211 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 183 మంది 400పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో సంజయ్‌కుమార్ 990, నీరజ్‌తేజ- 988 మార్కులు, బైపీసీలో శ్రవణ్‌కుమార్-982, సిదార్థ-980 సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.



పాపిరెడ్డికాలనీలో విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న రవికుమార్‌యాదవ్

బీజేపీ ఇంటింటి ప్రచారం

చందానగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చందానగర్ పాపిరెడ్డికాలనీ, రాజీవ్‌గృహకల్పలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, నర్సింహ, నీలకంఠరెడ్డి, ఎల్లేశ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

భారీ విద్యుత్ డిమాండ్

సబ్‌స్టేషన్లలో పీటీఆర్ సామర్థ్యం పెంపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో శివారు ప్రాంతాల్లో భారీగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో రంగారెడ్డి జోన్‌పరిధిలోని పలు సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాలను యుద్ధప్రాతిపదికన అధికారులు పెంచుతున్నారు. విద్యుత్ డిమాండ్ రెట్టింపైనా సరఫరాలో అంతరాయాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటునట్లు రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్ బుధవారం తెలిపారు. ఎస్ఈ స్థాయి అధికారుల నుంచి డీఈ, ఏడీఈ, ఏఈలు, లైన్‌మెన్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు 24 గంటలు అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్తగూడ, కొండాపూర్ సబ్‌స్టేషన్లలో 12.5 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్)లను బుధవారం చార్జి చేసినట్లు అధికారులు తెలిపారు. గతేడాదితో పోల్చితే రంగారెడ్డి జోన్‌లో సమ్మర్‌లో విద్యుత్ డిమాండ్ 30 శాతం పెరిగిందని, మే నెల వరకూ ఇదే విధంగా విద్యుత్ డిమాండ్ నమోదయ్యే అవకాశాలుంటాయని అధికారులు చెబుతున్నారు.



కొత్తగూడ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను చార్జ్ చేసిన రంగారెడ్డి సీజీఎం ఆనంద్, అధికారులు

కూకట్‌పల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ ప్రచారం

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించబోతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్‌లోని పాపిరెడ్డినగర్, ఆజ్‌బెస్టాస్ కాలనీల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఈ సందర్భంగా ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్



అబిద్

జీడిమెట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడుతూ, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్, భూకబ్జాదారుడు షేక్ అబిద్‌ను జగద్గిరిగుట్ట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అబిద్(35) గతంలో షాపూర్‌నగర్ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుని జీవించేవాడు. కొన్నేళ్లుగా గాజులరామారం ప్రాంతంలోని 329 బై 1,342 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని పేదలకు విక్రయించి కోట్ల రూపాయలు సంపాదించాడు. ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను తొలగించడంతో అబిద్ ద్వారా మోసపోయిన బాధితులు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టారు. తమకు న్యాయం చేయాలని, తమ నుంచి తీసుకున్న లక్షల రూపాయలు తిరిగి ఇవ్వమంటే చంపేస్తామని బెదిరిస్తుడని పేర్కొన్నారు. 58, 59జీఓల కింద రెగ్యులర్ చేయిస్తానని పెద్దఎత్తున డబ్బులు తీసుకుని ప్రజలను మోసం చేసినట్టు పోలీసులు గుర్తించారు. అతడిపై ఇప్పటికే 16 కేసులునమోదు అయ్యాయి. దీంతో అబిద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.

28న ఉప్పల్ శిల్పారామంలో

నృత్యోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యగురువుల బృందం సిద్ధ నాట్యకళాసమితి ఆధ్వర్యంలో నాదమ్ శీర్షికతో ఈనెల 28న ఉప్పల్ శిల్పారామంలో నృత్యోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాణీరమణ, ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలో ఆవిష్కరించారు.

